విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి స్థల పరిశీలన

మెహిదీపట్నం, సెప్టెంబర్ 4 : ప్రజలకు విద్యుత్ సమస్యలు లేకుండా అదనంగా సబ్‌స్టేషన్ల నిర్మాణానికి విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా నాంపల్లి నియోజకవర్గంలోని మెహిదీపట్నం ప్రాంతంలో రెండు విద్యుత్ సబ్ స్టేషన్లను నిర్మించడానికి బుధవారం ఆసిఫ్‌నగర్ మండల తహసీల్దార్ జ్యోతితో కలిసి ఆసిఫ్‌నగర్ విద్యుత్ సబ్ డివిజన్ డీఈ శ్యాంసుందర్‌రెడ్డి రెండు స్థలాలను పరిశీలించారు. మెహిదీపట్నం లాల్‌బహదూర్ కళాశాల ముందు,జి,పుల్లారెడ్డి కాలేజ్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలం సబ్‌స్టేషన్ల నిర్మాణానికి అనువుగా ఉన్నాయని డీఈ శ్యాంసుందర్ రెడ్డి తహసీల్దార్ జ్యోతికి వివరించారు. దీంతో ఈ స్థలాలను విద్యుత్ శాఖ వారికి అప్పగించడానికి రెవెన్యూ అధికారులు సంసిద్ధత వ్యక్తం చేశారు. స్థలాలను అప్పగించిన వెంటనే సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ఉన్నతాధికారుల అనుమతితో పనులు ప్రారంభిస్తామని విద్యుత్ డీఈ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏసీగార్డ్స్,మెహిదీపట్నం విద్యుత్ ఏడీలు నరసింహారెడ్డి,సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మెహిదీపట్నంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి, విద్యుత్ డీఈ శ్యాంసుందర్ రెడ్డి, ఏడీలు తదితరులు

పలు ప్రాంతాల్లో గుంతలు పూడ్చివేత

అబిడ్స్, సెప్టెంబర్ 4: వరుసగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రహదారులపై ఏర్పడిన గుంతలను సిబ్బంది పూడ్చివేస్తున్నారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ గుంతల పూడ్చి వేత పనులు జరుగుతున్నాయి. బుధ వారం జోన్ ఎస్ఈ సహదేవ్ రత్నాకర్ గుంతల పూడ్చివేత పనులను పర్యవేక్షించి అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు.

రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చివేస్తున్న పనులను పర్యవేక్షిస్తున్న ఎస్ఈ సహదేవ్ రత్నాకర్

ఎల్వోసీ అందజేత

కార్వాన్ నియోజకవర్గం నానల్‌నగర్ డివిజన్ ఖాదర్‌బాగ్‌కు చెందిన రబీయా బేగంకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ. 2 లక్షల ఎల్వోసీని బుధవారం కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ టోలిచౌకిలోని కార్యాలయంలో కుటుంబ సభ్యులకు అందజేశారు.
– మెహిదీపట్నం సెప్టెంబర్ 4

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత

నాంపల్లి,కార్వాన్ నియోజకవర్గాలకు చెందిన ఇద్దరికి సీఎం రిలీఫ్ ఫండ్‌లో మంజూరైన చెక్కులను బుధవారం ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్ ఖాద్రి తన నివాసంలో అందజేశారు.
–మెహిదీపట్నం సెప్టెంబర్ 4

హుండీ ఆదాయం లెక్కింపు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 4 : చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి.సురేఖ పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది ఈ సందర్భంగా కార్యనిర్వాహణాధికారి దేవనాథం మాట్లాడుతూ రూ.1,59,131 వచ్చినట్లు తెలిపారు. ప్రధాన అర్చకులు లక్ష్మీపతిశర్మ, వెంకటాద్రి, రాజన్, జానిక సపుధాకర్, శ్రీకాంత్ తదితరలు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి

జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కోరిన కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, సెప్టెంబర్ 4 : గాంధీనగర్ డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్‌లో పనులు పూర్తి చేసేందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో అనేక అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ డివిజన్ అభివృద్ధిపై అధికారులకు సమీక్ష సమావేశంను నిర్వహించి పెండింగ్ పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

జలమండలి కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీ.పీసీసీ ఓబీసీ సెల్ సీనియర్ జనరల్ సెక్రటరీ పొల్కం శ్రీనివాస్ కోరారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మయాంక్ మిత్తల్‌ను ఆయన కార్యాలయంలో బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు.అనంతరం శుభాకాంక్షలు తెలిపారు. –అబిడ్స్, సెప్టెంబర్ 4

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

దోమలు వృద్ధి చెందకుండా పిచికారీ చేస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

మెహిదీపట్నం సెప్టెంబర్ 4: ప్రజలు డెంగ్యూ బారిన పడకుండా బస్తీలలో,కాలనీలలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ సర్కిల్ –13 డిప్యూటీ కమిషనర్ శశిరేఖ అన్నారు. బుధవారం ఎంటమాలజీ విభాగం అధికారులు,సిబ్బందితో కలిసి లంగర్‌హౌస్,టోలిచౌకి,నానల్‌నగర్ ప్రాంతాల్లో దోమల నివారణకు పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలలో దోమలు వృద్ధి చెందకుండా రసాయనాలను పిచికారీ చేశారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళి

ముషీరాబాద్, సెప్టెంబర్ 4: చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా బుధవారం భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ముఖ్య అతిథిగా పాల్గొని రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్ పుస్కారాన్ని అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంటే పాఠ్యపుస్తకాలలోని అంశాలు చెప్పేవారు కాదని, జీవిత మార్గం చూపే వారని అన్నారు. ఈ కార్యక్రమంలో లంక లక్ష్మీనారాయణ, అక్కిరాజు సుందరరామకృష్ణ, పేరి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ శివప్రసాద్‌కు పురాస్కారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

పెండింగ్ పనులు పూర్తి చేయండి

మెహిదీపట్నం సెప్టెంబర్ 4: నాంపల్లి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మహ్మద్‌మాజీద్ హుస్సేన్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని బుధవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో కలిసి కోరారు. అదేవిధంగా అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

అభివృద్ధి పనులపై కమిషనర్‌కు వివరిస్తున్న నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్

అల్ అమీన్ జల్సా(సభ)ను ఘనంగా నిర్వహించాలి

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే అల్ అమీన్ జల్సా(సభ)ను విజయవంతంగా నిర్వహించడానికి పార్టీ నాయకులు,కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ అధ్యక్షులు,హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు.బుధవారం టోలిచౌకిలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ,జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు,నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.
– మెహిదీపట్నం సెప్టెంబర్ 4



తిరుమల శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ బుధవారం తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వీఐపీ విరామ సమయంలో ఆయన గోల్నాక డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులతో కలిసి స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆశీర్వాదం తీసుకొని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. – గోల్నాక, సెప్టెంబర్ 4

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి

జోనల్ కమిషనర్ జయంతితో అభివృద్ధి పనులపై చర్చిస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే

మెహిదీపట్నం సెప్టెంబర్ 4: కార్వాన్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి సూచించారు. ఈ మేరకు బుధవారం జోనల్ కమిషనర్‌ను ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులపై చర్చించారు.

'లాల్ నీల్ స్ఫూర్తి ప్రదాతలు' పుస్తకావిష్కరణ

చిక్కడపల్లి,సెప్టెంబర్ 4 : తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం(టీపీఎస్‌కే) ఆధ్వర్యంలో రచయిత జి.రాములు రచించిన 'లాల్‌నీల్ స్ఫూర్తి ప్రదాతలు' పుస్తకావిష్కరణ కార్యక్రమం బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైడ్ ఐఏఎస్ అధికారి కాకి మాధవరావు హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాకిమాధవరావు మాట్లాడుతూ లాల్‌నీల్ స్ఫూర్తి ప్రదాత పుస్తకంలో అనేక మంది ప్రముఖులకు సంబంధించిన స్ఫూర్తి దాయకమైన విషయాలను ప్రస్తావించడం జరిగిందన్నారు. భారతదేశంలో క్యాస్ట్ లేని క్లాస్ లేదన్నారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ లాల్‌నీల్ స్ఫూర్తి ప్రదాతల స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, ప్రొఫెసర్ ననుమాస స్వామి, తెలంగాణ సాహితీ కార్యదర్శి ఆనంద్ చారి డాక్టర్ జిలకర శ్రీనివాస్, సూర్య ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కాకిమాధవరావు, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ తదితరులు

గవర్నర్‌కు ఆహ్వానం

రాజ్‌భవన్‌లో బుధవారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఇనిస్టిట్యూట్ ఫర్ దివ్యాంగ్ సంస్థ సిల్వర్ జూబ్లీ వేడుకలకు ఆహ్వానించారు. అనంతరం త్వరలో నిర్వహించనున్న వేడుకల ప్రత్యేక సావనీర్‌ను ఆవిష్కరించినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ పద్మావతి తెలిపారు.
– తెలుగు యూనివర్సిటీ

జీవన్‌దీప్తికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తాం

రవీంద్రభారతి, సెప్టెంబర్ 4 : పారిష్ ఫారా ఒలంపిక్స్ టీం 20 విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో మొదటిసారిగా కాంస్య పతకం సాధించిన తెలంగాణ బాలిక జీవన్‌దీప్తికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రూ.5లక్షలు చెల్లిస్తామని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తెలిపారు. బుధవారం రవీంద్రభారతిలోని సమావేశం మందిరంలో ఫారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శివసేనారెడ్డిని, దివ్యాంగుల హక్కుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యను గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణకు కీర్తి ప్రతిష్టలు చాటిచెప్పిన దీప్తికి అభినందనలు తెలిపారు.ఎల్‌బి స్టేడియంలో ఫారా స్పోర్ట్స్ అసోసియేషన్‌కు గది కేటాయిస్తామన్నారు. క్రీడాపాలసీలో భాగంగా ప్రభుత్వ తరపున ఫారా క్రీడాకారులకు అవార్డులు ,రివార్డులు అందజేస్తామని వెల్లడించారు.ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫారా క్రీడాకారులను ప్రోత్సహిస్తూనే వారికి అవసరమైన క్రీడా సామగ్రిని అందజేస్తామన్నారు.అసోసియేషన్ అధ్యక్షుడు సింగారపు బాబు, ప్రధాన కార్యదర్శి గాదపల్లి ప్రశాంత్,అసోసియేషన్ సలహాదారుడు సంజీవయ్య,రాజేశ్‌కుమార్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డిని సన్మానిస్తున్న ఫారా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

బాలికను లాడ్జికి తీసుకొచ్చినందుకు ఇద్దరి అరెస్టు

సుల్తాన్‌బజార్,సెప్టెంబర్ 4: మైనర్‌ను లాడ్జికి తీసుకొచ్చిన ఓ యువకుడితో పాటు లాడ్జి నిర్వాహకుడిపై పోక్సో యాక్ట్ కింద అరెస్టు చేసిన ఘటన అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది.ఈ మేరకు ఎస్ఐ జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం చార్మినార్,చంచల్ గూడ ప్రాంతానికి చెందిన షేక్ ఫహీమ్(20) ఓ బాలికను తీసుకొని అఫ్జల్‌గంజ్ ప్రాంతంలోని రఘురామ్ లాడ్జికి తీసుకొచ్చాడు. ఎటువంటి ధృవీకరణ పత్రాలు లేకున్నా లాడ్జిలో గదులను కేటాయిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఆ బాలికను తీసుకొచ్చిన యువకుడిని, గదులను కేటాయిస్తున్న లాడ్జి నిర్వాహకుడు సురేకాంత్(48)లను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా లాడ్జి నిర్వాహకుడు, యువకుడిని అరెస్టు చేసిన పోలీసులు క్రైమ్ నెంబర్ 414/24 ,అండర్ సెక్షన్ 137(2),64,ఆర్/డబ్ల్యూ 49 బీఎన్ఎస్, అండ్ 5ఆర్ డబ్ల్యూ 6 పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితులను ఆదుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీబీపీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్

రవీంద్రభారతి,సెప్టెంబర్ 4 : వరద బాధితులకు తక్షణమే రెండు రాష్ట్రాల ప్రజలకు సాయం అందించాలని, వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.
డీబీపీ పార్టీ కేంద్ర కార్యాలయంలో వడ్లమూరి కృష్ణస్వరూప్ మాట్లాడుతూ తక్షణమే తెలంగాణ ప్రాంతానికి రెండువేల కోట్లు, ఆంధ్రాప్రాంతానికి ఐదువేల కోట్ల నిధులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ వరదల్లో మృతి చెందిన కుటుంబాలకు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని,గాయపడిన వారికి రూ.5 లక్షలు, సర్వం కోల్పోయిన వారికి మౌలిక సదుపాయల కల్పనకు 10 లక్షలు, వ్యవసాయ కూలీలకు రెండు లక్షలు,రైతుల పంటనష్టంకు 2క్షల పరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సిలివేరి వసంతరావు, బీరం సతీష్‌కుమార్, గోలి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి రెండు రోజుల జైలు

సుల్తాన్‌బజార్,సెప్టెంబర్ 4: అప్పుగా తీసుకున్న డబ్బులను తిరిగి ఇవ్వమని అడిగినందుకు ఓ వ్యక్తిపై దాడి చేసిన మరో వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.50 జరిమానా విధిస్తూ మూడో మెట్రోపాలిటన్ న్యాయస్థానం తీర్పునిచ్చింది.ఎస్ఐ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం వ్యాపారి బాలాజీ కందస్వామిలేన్‌లోని వ్యాపారం చేసుకునే భీమన్న శంకర్ వాడే (26)కు పది వేలు ఇచ్చాడు. ఇచ్చిన అప్పును తిరిగి అడగగా ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.ఆగ్రహించిన భీమన్న శంకర్ బాలాజీపై దాడి చేసి అసభ్య పదజాలంతో దూషించాడు.దీంతో బాధితుడు బాలాజీ సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి గాంధీభవన్ వద్ద ఉన్న కోర్టుల సముదాయంలోని మూడవ మెట్రోపాలిటన్ న్యాయస్థానం ముం దు హాజరపరుచగా న్యాయమూర్తి నిందితుడు భీమన్న శంకర్ వాడేకు రెండు రోజుల జైలు శిక్షతో పాటు 50 రూపాయల జరిమానాను విధించినట్లు ఎస్ఐ మధుసూదన్ తెలిపారు.

లెక్కలు తేలేవరకు ఎన్నికలు నిర్వహించొద్దు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎస్‌కే సమాజ్ ప్రతినిధులు

అబిడ్స్, సెప్టెంబర్ 4 : ఎస్ఎస్‌కే సమాజ్‌లో జరిగిన అవకతవకలను దృష్టిలో పెట్టుకుని వాటి లెక్కలు తేలేవరకు ఎన్నికలు నిర్వహించరాదని న్యాయస్థానం సూచించిందని ఆ సమాజ్ సభ్యులు రతన్ మహేష్, నగరి రాధాకృష్ణ, జ్యోతిప్రభు, కోటి రవిలు పేర్కొన్నారు. బుధవారం ఎస్ఎస్‌కే సమాజ్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్ఎస్‌కే సమాజ్‌లో కోటి ముప్పై లక్షల నిధులను కాజేయడంతో ఎస్ఎస్‌కే సమాజ్ ప్రతినిధులు ఇద్దరిని ఏప్రిల్ మాసంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో బహిష్కరించినట్లు తెలిపారు. దీంతో సమాజ్ సభ్యుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో న్యాయస్థానం ఓటరు నమోదు కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహించ వచ్చన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

ముషీరాబాద్, సెప్టెంబర్ 4: ప్రజా సమస్యలను మండలిలో లేవనెత్తి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో తెలంగాణ జనసమితి గ్రేటర్ అధ్యక్షుడు యం నర్సయ్య ఆధ్వర్యంలో కోదండరామ్ ఆత్మీయ పౌర సన్మానం సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవి అనేది సాధనమే కానీ అది అంతిమ లక్ష్యం కాదన్నారు. తెలంగాణలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారాని కృషిచేయడంలో ప్రజలకు ప్రభుత్వానికి వారిధిగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, బట్టల రాంచందర్, మానేపల్లి లక్ష్మణ్, రవికాంత్, సురేశ్‌కుమార్, మెరుగ శ్రీనివాస్ యాదవ్, సుధాకర్, కే రాజు తదితరులు పాల్గొన్నారు.

దివాకరబాబుకు పురస్కారం ప్రదానం

రచయిత శ్రీమాడభూషి దివాకరబాబును పురస్కారంతో సత్కరిస్తున్న దర్శకుడు ఎస్‌వీ.కృష్ణారెడ్డి

రవీంద్రభారతి, సెప్టెంబర్ 4 : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ,శ్రీకళానికేతన్ హైదరాబాద్, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో 60 వసంతాల వజ్రోత్సవ వేడుకల సందర్భంగా ప్రముఖ నాటక సినీ రచయిత శ్రీమాడభూషి దివాకర్‌బాబుకు కళానికేతన్ వజ్రోత్సవ రంగస్థల పురస్కారం ప్రదానోత్సవ కార్యక్రమం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా (ఐఏఎస్)అధికారి పార్థసారథి, ప్రముఖ సినీ రచయిత,దర్శకుడు ఎస్.వి కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డిలు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సినీ రచయిత శ్రీమాడభూషి దివాకరబాబుకు కళానికేతన్ వజ్రోత్సవ రంగస్థల పురస్కారం ప్రదానం చేశారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మాడభూషి దివాకరబాబుకు రంగస్థల పురస్కారం రావడం అభినందనీయమన్నారు.ఆయన గొప్ప సినీ రచయితగా పేరుప్రఖ్యాతులు సంపాదించారని వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో హర్షవర్ధన్ మాడభూషి, డా.ఓ శ్రీనివాస్‌రెడ్డి,తడకమళ్ళ రామచందర్‌రావు ,కృష్ణ సాయి,వాసు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని భావితరాలకు అందించాలి

డాక్టర్ ఆచార్య ఫణీంద్ర రచించిన పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథం ఉషోదయ యుగం ఆవిష్కరణ సభలో పాల్గొన్న సాహితీవేత్తలు

తెలుగు యూనివర్సిటీ, సెప్టెంబర్ 4. తెలుగు భాష ఔన్నత్యాన్ని భావితరాలకు అందించాలని ప్రముఖ సాహితీవేత్త ఆచార్య వంగపల్లి విశ్వనాథం ఆకాంక్షించారు. యువభారతి, నవ్య సాహితీ సమితి సంయుక్తాధ్వర్యంలో సుల్తాన్‌బజార్‌లో గల శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ఆడిటోరియంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఆచార్య ఫణీంద్ర రచించిన 'పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథం ఉషోదయ యుగం' ఆవిష్కరణ సభ బుధవారం జరిగింది. తెలుగు యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి. గౌరీశంకర్ ముఖ్య అతిథిగా హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించి రచయిత ఫణీంద్ర సాహిత్య సేవను ప్రశంసించారు. తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి రమణాచారి ప్రసంగిస్తూ నిత్యసాహిత్య కృషివలుడు ఆచార్య ఫణీంద్ర అని అన్నారు. సాహితీవేత్తలు ఆచార్య ఎస్వీ రామారావు, జి. వసుంధర, డాక్టర్ జి.ఎల్.కె దుర్గ, డాక్టర్ బి.జయరాములు, యువభారతి అధ్యక్షులు ఎ.నాగేశ్వరరావు, కార్యదర్శి జీడిగుంట వెంకట్రావు, నవ్య సాహితీ సమితి అధ్యక్షులు వేమరాజు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ (ఓడీఎల్) నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలతో పాటు మూడేళ్ల ఫార్మ్‌డీ, ఆరేళ్ల ఫార్మ్‌డీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.